క్లుప్తంగా

నిరుపయోగంగా చేతిపంపు



మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ని తలారివెట్టు గ్రా మ పంచాయతీ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్ ఎస్సీ కాలనీ లోని తాగునీటి చేతిపంపు మరమ్మతులకు గురైంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి కోసం కిలోమీటరు దూరంలో ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన చేతిపంపు నిరుపయోగంగా మారింది. చేతిపంపు మరమ్మతులకు గురై ఏడాది అవుతున్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి చేతిపంపునకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దర్గా కమిటీ సభ్యుల సమావేశం



సమావేశమైన ఉరుసు కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నది సమీపంలో ఉన్న దర్గాలో ఉరుసు నిర్వహణపై చర్చించడానికి ఆ దర్గా కమిటీ సభ్యులు సోమవారం సమావేశమయ్యారు. గంధోత్సవాన్ని విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉరుసు కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు, సభ్యులు రాజేశ్వరరావు, రమేష్‌బాబు, పులి రామచంద్రయ్య, ఉదయ్‌కుమార్, బావాజన్, రహీంఖాన్, అబ్దుల్లా, సయ్యద్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

స్పేస్ క్విజ్‌లో మణికి నగదు బహుమతి



శ్రీకాళహస్తి: నేషనల్ స్పేస్ డే క్విజ్‌లో తొట్టంబేడు మండలం పూడివ గిరిజనకాలనీకి చెందిన కంపా మణి ప్రతిభ చూపాడు. నేషనల్ వాటర్ అకాడమీ, సెంట్రల్ వాటర్ కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ నేషనల్ స్పేస్‌డే క్విజ్‌లో లోకో పైలెట్‌గా పనిచేస్తున్న మణి తృతీయస్థానం సాధించి, ధ్రువపత్రంతోపాటు రూ.50 వేలు నగదును పొందారు. ఆయన్ని పలువురు ప్రశంసించారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, పసుపు, కుంకుమ, విభూధి తదితర సుగంధద్రవ్యాలు, నారికేళ జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన చెంగాళ పరమేశ్వరిదేవి ఉత్సవాలు

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలోని శ్రీ చెంగాళ పరమేశ్వరిదేవి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఊంజల్ సేవకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పుష్పాలంకరణలు చేపట్టారు. అనంతరం ధూపదీప నైవేద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఊంజల్ సేవ నిర్వహించారు. అంతకుముందు ఆలయంలోని అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు, ఆలయ ధర్మకర్త బొప్పన తిలక్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కరాటే పోటీల్లో శ్రీకాళహస్తి విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్, నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపారు. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గలో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన కోచ్ వినోద్ ఆధ్వర్యంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. 25 కిలోల విభాగంలో క్రీడాకారిణి ప్రఖ్యాత, 35 కిలోల విభాగంలో క్లారిస్, 28 కిలోల విభాగంలో నమస్వి బంగారు పతకాలు సాధించారు. అలాగే 27 కిలోల విభాగంలో కుశాంత్‌కుమార్, 21 కిలోల విభాగంలో తన్వి వెండి పతకాలను సాధించారు. వీరికి నిర్వాహకులు పతకాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. వీరిని పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

అత్యంత హేయమైన ఘటన



వైద్యో నారాయణ అని వైద్యులను దైవంతో పోల్చే సమాజం మనది. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం చేసి దారుణంగా హతమార్చడం నన్ను తీవ్రంగా కలచివేసింది. కర్కశత్వ మృగాళ్ల మధ్య మహిళలకు రక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. మరొకరు ఈ తరహా దుశ్చర్యలకు పాల్పడాలంటేనే వణుకు పుట్టేలా నిందితులకు కఠిన శిక్ష విధించాలి. మృతురాలి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. – డాక్టర్ రమాదేవి గౌరినేని, అమర ఆస్పత్రి, రేణిగుంట



కఠిన చట్టాలు తీసుకురావాలి



ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు భద్రత లేకుండా పోయింది. నిర్భయంగా విధులు నిర్వహించలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వాలు మహిళా డాక్టర్ల రక్షణ కోసం కఠినమైన చట్టాలు తీసుకురావాలి. విధుల్లో కూడా సడలింపు ఇవ్వాలి. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా దుండగులకు కఠిన శిక్షలు విధించాలి. మహిళా డాక్టర్లకు ప్రత్యేక గదులు కేటాయించాలి. వైద్యశాలల వద్ద సీసీ కెమెరాలు, పోలీసుల గస్తీ తప్పకుండా ఉండాలి. – ద్వైత, వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యురాలు

కేవీకే.. అన్నదాతల ఆత్మస్థైర్యం

వ్యవసాయం..దేశ ప్రజల పట్టెడన్నం పెట్టే కీలక రంగం. రోజురోజుకీ మారుతున్న పరిస్థితులు.. వాతావరణ అనుకూలత.. ప్రకృతి వైపరీత్యాలు.. ఆరుగాలం శ్రమను ఆవురావురుమంటూ తినే తెగుళ్లు.. ఇలా హలాలు పట్టి పొలాలు దున్నింది మొదలు.. పంట ఉత్పత్తులను లాభసాటి ధరలకు విక్రయించే వరకు అడుగడుగునా ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. ఇలాంటి పరిస్థితులను అన్నదాతలు ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవడం అనేది చాలా అవసరం.. అందుకు కీలకశక్తిగా తన వంతు పాత్ర పోషిస్తోంది.. క్షేత్రస్థాయిలో కర్షకులకు అండగా ఉంటూ విలువైన సలహాలు, సూచనలు, ఆధునిక విజ్ఞానంపై అవగాహన కల్పిస్తోంది కరకంబాడి వనస్థలిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం.

- 32 ఏళ్లుగా రైతులకు దన్నుగా రాస్ కేవీకే శాస్త్రవేత్తలు
- పుడమి పుత్రులకు అండగా..
- సాగుకు ఆధునిక విజ్ఞానంపై అవగాహన కల్పన

రేణిగుంట: మండలంలోని కరకంబాడి వనస్థలిలో 1992వ సంవత్సరంలో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ), న్యూఢిల్లీ సహకారంతో రైతుల కోసం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం స్థాపించారు.



ప్రదర్శన క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

ఈ కేంద్రంలో వ్యవసాయ అనుబంధ విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలు రైతులకు ప్రదర్శన క్షేత్రాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, పంట కాలంలో ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందజేసి రైతుల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తోంది.

లాభాల సేద్యానికి తోడ్పాటు

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సాగుకు మేళవించి రైతులకు లాభాల సేద్యం అందించడంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం తోడ్పాటునందిస్తోంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మెళకువలను రైతులకు శిక్షణ శిబిరాల ద్వారా నేర్పి, ప్రావీణ్యాన్ని అందించడంతోపా టు సబ్సిడీతో రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులను అందిస్తూ చేయి పట్టి నడిపిస్తోంది. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల్లోనూ ప్రావీణ్యం పొందిన శాస్త్రవేత్తలు రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఉన్నారు. వీరంతా రైతులతో మమేకమై లాభాల సాగును రైతులకు పరిచయం చేస్తున్నారు.

70 నూతన సాంకేతిక పద్ధతులు.. 3,500 శిక్షణ కార్యక్రమాలు

రాస్ కేవీకే తరపున ఇప్పటివరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వివిధ పంటలకు సంబంధించి సుమారు 70 నూతన సాంకేతిక పద్ధతులను రైతుల పొలాల్లో క్షేత్ర పరిశీలనలు చేసి, అవగాహన కల్పించారు. జిల్లాలో సుమారు లక్ష మంది పైగా రైతులు, మహిళారైతులు, గ్రామీణ యువత, విస్తరణ అధికారులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో సుమారు 3,500 శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ఆధునిక పద్ధతులు, పంట యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, భూసార పరిరక్షణ, ప్రకృతి వ్యవసాయం, యంత్ర పరికరాలు, విత్తనోత్పత్తి, విలువ ఆధారిత ఉత్పత్తులు, పట్టు పరిశ్రమ, పాడి పరిశ్రమ, పెరటి కోళ్ల పెంపకం, ఔషధ మొక్కలు, పుట్టగొడుగుల పెంపకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామీణ యువతకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి పొందడానికి అవకాశాలు కల్పించారు.



ఔషధ మొక్కల పెంపకం

ఈ కేంద్రంలో వరి, వేరుశనగ, పప్పు ధాన్యాలు, ఉద్యాన పంటలు, మల్బరీ తోటల తోపాటు ఔషధ మొక్కల క్షేత్రాన్ని సాగుచేస్తూ ఆయుర్వేద వైద్య విధానాన్ని, మొక్కల్లో దాగి ఉన్న ఔషధ గుణాలను రైతులకు తెలియజేస్తూ ప్రదర్శనా క్షేత్రాల నిమిత్తం రైతులకు మొక్కలను పంపిణీ చేసి, అన్ని చోట్ల ఔషధ మొక్కల వ్యాప్తికి కృషి చేస్తున్నారు. దీంతో పాటు అటవీ వ్యవసాయానికి సంబంధించి శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలను విత్తనోత్పత్తి చేసి రైతులకు అందజేస్తున్నారు. భూసార పరీక్షా కేంద్రం ద్వారా ఇప్పటివరకు సుమారు 20వేలకు పైగా మట్టి నమూనాలు పరీక్షించి, రైతులకు భూసార పరీక్షా పత్రాలు అందజేసి, వారికి వాటి ఫలితాల ఆధారంగా ఎరువులను సిఫారసు చేశారు.

రైతులకు ఆసరాగా కేవీకే



32 ఏళ్లుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించడంలో మేము ఆసరాగా నిలుస్తున్నాం. వ్యవసాయ అనుబంధ రంగాలు ఉద్యాన పంటలు, పాడి పరిశ్రమ, ఔషధ మొక్కలు పెంపకం, మల్బరీ సాగును ప్రోత్సహించే దిశగా రైతులతో ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేశాం. ఇక్కడే భూసార పరీక్ష కేంద్రం ఉంది. వ్యవసాయంలో డ్రోన్లను తీసుకొచ్చి రైతులకు పరిచయం చేశాం. ముున్ముందు కేవీకే అనేక కార్యక్రమాలను చేపట్టి రైతు సంక్షేమానికి బాటలు వేస్తుంది. రైతులు వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే నివృతి చేస్తాం.

– డాక్టర్ శ్రీనివాసులు, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే, రేణిగుంట.

డ్రోన్‌తో క్రిమి సంహారక మందు పిచికారీ

కూలీల కొరతతో పంటల్లో పురుగు మందులు పిచికారీ చేయడం రైతులకు చాలా ఇబ్బందిగా మారుతోంది. దీనిని దృష్టిలో వుంచుకుని 'అగ్రికల్చర్ డ్రోన్ ప్రాజెక్ట్' లో భాగంగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, రాస్–కేవీకేని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి, జిల్లాలో 12 మండలాల్లో సుమారు 724 ఎకరాల్లో వరి, వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, మినుము, పెసర, నువ్వులు, చెరుకు,టమాట, మిరప, సంపంగి, బంతి, మామిడి, దోస, లెమన్ గ్రాస్ వంటి పంటల్లో పురుగు మందులు, కలుపు మందులు, కషాయాలు డ్రోన్ ద్వారా పిచికారీ చేసి, రైతులకు డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు.



డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన (ఫైల్)

భద్రత, రక్షణ కల్పించాలి



పుష్కిత్ కర్మాగారం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

ఏర్పేడు: పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు యాజమాన్యం భద్రత, రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య అన్నారు. సోమవారం మండలంలోని పుష్కిత్ కర్మాగారం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అచ్యుతాపురం ఎషన్షియా ఫార్మా కంపెనీలో అతి పెద్ద ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలన్నారు. తరచూ ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడడం తోపాటు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంధం మణి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రుయాలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ చలపతి రెడ్డి

తిరుపతి తుడా: జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలను సోమవారం తిరుపతి రుయా ఆస్పత్రి కంటి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రుయాలో అవగాహన కల్పించి, రోగులకు కంటి పరీక్షలు చేశారు. రుయా కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతి రెడ్డి రోగులను ఉద్దేశించి మాట్లాడారు. నేత్రదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధ్రులకు కంటి చూపును ప్రసాదించవచ్చన్నారు. మరణాంతరం 8 గంటల వ్యవధిలోపు నేత్రాలను దానం చేయవచ్చన్నారు. నేత్రదానాన్ని కుటుంబ సంప్రదాయంగా మార్చుకోవాలని ఆయన హితువు పలికారు. కార్యక్రమంలో కంటి విభాగ వైద్యాధికారులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ,పీజీ వైద్య విద్యార్థులు, రోగులు, వారి సహాయకులు పాల్గొన్నారు.

మొదలైన వినాయక సందడి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా వినాయక చవితి సందడి మొదలైంది. వచ్చే నెల 7వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అయితే బుచ్చినాయుడుకండ్రిగలో గణనాథుల విగ్రహాలు సిద్ధమయ్యాయి. పలుచోట్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కళాకారులు భారీ సైజు మట్టి గణపతుల ప్రతిమలను విక్రయానికి సిద్ధం చేశారు. బొజ్జ గణపయ్యలు వివిధ ఆకృతులు, ప్రత్యేక రంగులతో కమల గణనాథుడు, సర్ప గణనాథుడు, శ్రీకృష్ణ రూప, నెమలి, రాజహంస, సింహాసన, వాహనాలతో పాటు గజరాజు, నంది, శంఖు, మూషికం, శివస్వరూప, ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. విగ్రహాల సైజు ఆధారంగా ధరలు ఉండనున్నాయి. విగ్రహాల కొనుగోలుకు ఉత్సవ నిర్వాహకులు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మట్టి ప్రతిమల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.



వివిధ రూపాల్లో తయారైన వినాయక విగ్రహాలు

ముక్కంటి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి





ధ్వజస్తంభం వద్ద న్యాయమూర్తి వెంకటరమణ, తెలంగాణ దేవదాయశాఖ కమిషనర్ హనుమంతరావు

శ్రీకాళహస్తి: మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి దుప్పాల వెంకటరమణ సోమవారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయాధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు కూడా స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు.

వర్షం..అపార నష్టం



ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట కోత దశలో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో రైతులకు అపార నష్టం మిగిలింది. శ్రీకాళహస్తి మండల పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి సుమారు 300 ఎకరాలు వరి పంట నేలకొరిగింది. మండలంలోని తొండమాన్‌పురం, అమ్మపాళెం , పుల్లారెడ్డి కండ్రిగ గ్రామాల్లో వరి పంట దెబ్బతినింది. అధికారులు స్పందించి పంట నష్ట పరిహారం పంపిణీ కి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. – శ్రీకాళహస్తి రూరల్

ఆబాల గోపాలం.. ఆనందమానందం







ఏర్పేడు: విశేషాలంకరణలో శ్రీకృష్ణుడు, బుచ్చినాయుడుకండ్రిగ: అలంకరణలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, వరదయ్యపాళెం: ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

- వాడవాడలా ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

నవనీతచోరుడతడు..నీలమేఘశ్యాముడతడు..మురళీకృష్ణుడతడు.. మురిపాల మోహనుడతుడు.. చిన్నికృష్ణయ్య పుట్టిన రోజు..జగమంతా వేడుకల రోజు అంటూ కృష్ణాష్టమి సందర్భంగా నందబాలలు, గోపికల సందడితో శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో ప్రతి పల్లె ఓ రేపల్లెను తలపించింది.



బుచ్చినాయుడుకండ్రిగ: ఉట్టి కొడుతున్న చిన్నారి

శ్రీకాళహస్తి: పట్టణంలోని పిచ్చాటూరు రోడ్డులో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం స్వామివారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, యాదవ సంఘం నాయకులు రామకృష్ణయాదవ్, కృష్ణయాదవ్, రమణయ్యయాదవ్, చెంచురత్నంయాదవ్, బాలుయాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, హరినాథ్ నాయుడు, గణేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో సోమవారం గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోకులాష్టమిని పురస్కరించుకుని ఆలయంలోని భిక్షాల గాలిగోపురం వద్ద ఉన్న సప్త గోకులం, దక్షిణ గాలిగోపురం వద్ద ఉన్న సప్తగోకులం, భరద్వాజతీర్థంలో ఉన్న గోశాలలో గోమాతలకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. గోశాలలో ఉన్న గోవులకు విశేషాలంకరణ చేసి, సంప్రదాయపద్ధతిలో పసుపు కుంకుమ పెట్టి, పూజలు నిర్వహించారు. అనంతరం గోమాతలకు నైవేద్యం సమర్పించారు. ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ గోమాతలను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించిన ఫలం దక్కుతుందన్నారు. గోమాత ఎక్కడ సంతోషంగా ఉంటే అక్కడ ప్రజలు సుఖజీవనం సాగిస్తారన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. మండలంలోని చింతలపాళెంలో ప్రబోదానంద యోగీశ్వర శ్రీకాళహస్తి ట్రస్టు ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు నిర్వహించారు. పిల్లలు శ్రీకృష్ణుని వేషధారణతో పిల్లనగ్రోవి ధరించి నాట్యం చేశారు. ఆలయంలో భక్తులు భజనలు, కోలాటాలతో నిర్వహించారు. అలాగే అంజిమేడు, మేర్లపాక, పాపానాయుడుపేట, ఏర్పేడు, సీతారాంపేట, కందాడు, ముసలిపేడు తదితర గ్రామాల్లో ఆలయాల్లో శ్రీకృష్ణుని విగ్రహాలకు వివిధ రకాల అభిషేకాలు జరిపారు. శ్రీకృష్ణభగవానుడికి విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లోని సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. చిన్నపిల్లలు చిన్నికృష్ణుడి, గోపికల వేషధారణల్లో చేసిన నృత్యం ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టారు. స్థానిక శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అర్చకులు శ్రీకృష్ణుడి లీలాలను గురించి భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని అంబికాపురంలో గల శ్రీకృష్ణాశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని స్వామివారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు చేసి, పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు సహసంపక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు బంగారు నాయుడు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.







శ్రీకాళహస్తి: పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీకృష్ణుడు, పూజల్లో పాల్గొన్న శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, వరదయ్యపాళెం: ఊంజల్ సేవ